క్లుప్తంగా

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జన్నారం: సంత్ సేవాలాల్ జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో హోరాహోరిగా పోటీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు సాయి, గంగాసింగ్, సుమన్ తెలిపారు. ఈ నెల 18వరకు పోటీలు కొనసాగుతాయని, జయంతి రోజున బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

ఆర్యసమాజ్‌లో ఆదర్శ వివాహం

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్యసమాజ్‌లో న్యాయవాది నట్టి నటేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శ వివాహాన్ని జరిపించారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన కళ, చెన్నూరుకు చెందిన రాకేశ్‌లు బెంగూళురులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. యువతికి తల్లిదండ్రులు లేకపోవడంతో జిల్లాకేంద్రంలో డాక్టర్ అయోధ్య రామయ్య, నర్సయ్యలు వివా హాన్ని జరిపించారు. పెళ్లి కుమారుడి తరుపున వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

మందమర్రి సీఐ పాలకుర్తికి బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి జనగాం జిల్లా పాలకుర్తి సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఆదివారం మందమర్రి నుంచి రిలీవ్ అయ్యారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస ఆచార్య

లక్సెట్టిపేట: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యం చేరుతారని వేకువ ఫౌండేషన్ లీడ్ ఇండియా నిపుణులు శ్రీనివాస ఆచార్యులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దని సెల్‌ఫోన్‌ను వాడకూడదన్నారు. రాబోవు వార్షిక పరీక్షలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం భవిష్యత్ ప్రణాళిక ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గఫార్, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమం కోసం ఐక్యంగా ఉండాలి

జన్నారం: రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం అందరం ఐక్యంగా ఉండాలని, సంక్షేమం దిశగా కృషిచేయాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ గుర్రం మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు ఏనుగు శుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. జన్నారం మండలం దేవునిగూడలో ఆదివారం సర్పంచ్ గుర్రం శిరీష, గోపాల్ రెడ్డి దంపతులను, కండక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్‌రెడ్డి దంపతులను రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు రాంచందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రాజరాంరెడ్డి, నాయకులు బాపురెడ్డి, తిరుపతిరెడ్డి, చుక్కరెడ్డి పాల్గొన్నారు.

పునర్నిర్మాణ పనులకు పూజలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున గల గౌతమేశ్వర ఆలయం పునర్నిర్మాణ పనులను ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రహరీ రేలింగ్ నిర్మాణ పనులతో పాటు, నవగ్రహాలు, నవనాగులు, దత్తాత్రేయుని ఆలయ సముదాయం నిర్మాణానికి దాతలు రాచర్ల రాధిక, చంద్రశేఖర్ దంపతుల సహకారంతో చేపడుతున్నారు. సిరిపురం రాజేశ్, కేశెట్టి వంశీకృష్ణ, పడకంటి శ్రీనివాస్, శ్రీదేవి గౌడ్, కాచం సతీశ్, తోట ప్రవీణ్, వుత్తూరి శివప్రసాద్, రాచర్ల చంద్రశేఖర్, అప్పాల శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని కాసిపేటలో ఇటీవల మరణించిన కుమ్మరి రామన్న, పోషన్నల కుటుంబాలకు స్థానిక హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున మొత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేష్, కల్లెం రాజన్న, లక్కాకుల వెంకటేష్, మాదాసు వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవర జాతరకు వేళాయె..!

- ముస్తాబైన ఆలయాలు
- నేడు బోనాల జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



చెన్నూర్ పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీలోని లక్ష్మీదేవర ఆలయం

చెన్నూర్: పాండవవంశంగా పేరొందిన ముదిరాజ్ ఆరాధ్యదైవం లక్ష్మీదేవర బోనాల జాతరకు లక్ష్మీదేవర ఆలయాలు ముస్తాభయ్యాయి. నాలుగు వందల ఏళ్ల ప్రాచీన చరిత్ర కలిగిన లక్ష్మీదేవర బోనాల ఉత్సవాలకు చెన్నూర్ పట్టణవాసులే కాకుండా మంచిర్యాల, బెల్లంపల్లి, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లతో పాటు మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

చెన్నూర్ పట్టణంలో..

చెన్నూర్ పట్టణంలోని బట్టిగూడెం, పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీల్లో గల లక్ష్మీదేవర ఆలయాల్లో సోమవారం నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలకు రంగులు వేసి బంతిపూలతో ముస్తాబు చేశారు.

మాఘ మాసంలోనే..

అనాధిగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఏటా లక్ష్మీదేవర బోనాల ఉత్సవాలను మాఘ మాసంలో నిర్వహిస్తారు. పాడి పంటలు చేతికి వచ్చిన తర్వాత బోనాల జాతరను ఘనంగా జరుపుకుంటారు. బోనాల ఉత్సవాల సందర్భంగా బట్టిగూడెం లక్ష్మీ అమ్మవారు నెల రోజులు తండ్రి గోలేటిలో గల భీమన్న ఆలయానికి వెళ్లి రావడం అనాధిగా వస్తున్న ఆచారమని పూజారి గిరెల్లి మల్లయ్య తెలిపారు.



చెన్నూర్ బట్టిగూడెం లక్ష్మీదేవర ఆలయం

కనుల పండువగా పట్నాలు..

లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణాల్లో పట్నాల సమర్పణ కనుల పండువగా నిర్వహిస్తారు. పట్నాలు సమర్పించిన అనంతరం లక్ష్మీ అమ్మవారు పట్నాలను తొక్కిన తర్వాత బోనాల జాతర ప్రారంభమవుతుంది. బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా...



బోనాల ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. పట్నాలు సమర్పించిన అనంతరం మధ్యాహ్నం 2గంటలకు బోనాల జాతర ప్రారంభమవుతుంది.

– గిరెల్లి మల్లయ్య, లక్ష్మీదేవర ఆలయ పూజారి

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



విజేతలతో జీఎం సంజీవరెడ్డి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సూచించారు. సీసీసీ సింగరేణి పాఠశాల 46వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం కార్మికులకు వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సుకై అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. పాఠశాలలో రూ.5లక్షలతో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఎస్ఓటు జీఎం రఘుకుమార్, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

లక్సెట్టిపేట: రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అల్లం నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పలు వీధుల్లో తిరుగుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులను ఆదివారం అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బైక్‌పై ముగ్గురు వెళ్లడం ఇష్టం వచ్చినట్లు సౌండ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం లాంటివి చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ లైసెన్సును కలిగి ఉండాలని లేకపోతే వాహనదారులు, తల్లిదండ్రులు బాధ్యులవుతారన్నారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, రాములు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



లక్సెట్టిపేట: స్థానిక రవీంద్రభారతిలో 2001–2002 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గడిపిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం డ్యాన్స్‌లు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కందుల తిరుపతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో రూ.22లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. హాజీపూర్ మండలానికి రూ.2కోట్ల ఈజీఎస్ నిధులు మంజూరు కాగా హాజీపూర్ మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ కింద సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. మొత్తంగా గ్రామాల్లోని రోడ్లు పూర్తయితే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. మొత్తంగా గ్రామాల అభివృద్ధికి అందరి సహకారంతో విశేష కృషి చేస్తానని పేర్కొంటూ, ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇళ్ల సమస్యలు, పెన్షన్ సమస్యలు మరే ఇతర సమస్యలు కూడా తీర్చి అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా ముందుకు సాగుతానన్నారు. మార్చి నుంచి మరో రెండు గ్యారంటీ పథకాలు అమలు జరగనుండగా ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమం అందరికి చేరవేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మాధవరపు రాజేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, మల్యాల రాజ్‌కుమార్, గుడెల్లి విష్ణు, బానయ్య, రాజేశం, ఎల్లయ్య, హాజీపూర్ గ్రామ ప్రత్యేక అధికారి, తహశీల్దార్ సతీశ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, డ్రెయినేజీ, రోడ్లు ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.కోటి అరవై లక్షలతో రోడ్ల నిర్మాణం కోసం ప్రారంభించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్, నాయకులు చింత అశోక్, చిన్నన్న, నాగభూషణం, రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదివారం ప్రారంభించారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీలు నవీన్, మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, మాజీ ఎంపీపీ కాంతరావు, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, నాయకులు సత్యంరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తినేని అర్జున్‌రావుకు నివాళి

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ మాజీ డీసీసీ అధ్యక్షుడు, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ముత్తినేని అర్జున్‌రావు వర్ధంతి సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, అత్తి సరోజ, ముత్తినేని రవికుమార్, గజ్జల హేమలత, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కోటపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంచిర్యాల జిల్లాలోని ప్రముఖ వైద్యులు రుద్రభట్ల రఘువంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు రఘువంశీ వందమంది చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన వైద్యులతో పాటు వైద్యశిబిరం ఏర్పాటుకు కృషి చేసి అన్ని సౌకర్యాలు కల్పించిన కపిల్ పనకంటిని మాజీ ఎంపీటీసీ స్వామి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాకపోకలకు ప్రజల అవస్థలు..!



తెలంగాణ చౌరస్తా వద్ద నిలిపి ఉంచిన వాహనాలు



రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీలు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్ వాహనాల స్టాండ్‌గా మారుతోంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారిపై లారీలు, ఇతర వాహనాలు నిలపటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాళ్లపేట్ తెలంగాణ చౌరస్తా నుంచి మొదలుకుని మేదరివాడ ప్రధాన రహదారి వరకు ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రోడ్డుపైన కార్లు, ఇతరత్రా వాహనాలు దర్జాగా ఉంచటంతో బెల్లంపల్లి చౌరస్తా నుంచి వచ్చే వాహన చోదకులు తికమక పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం కనబడకపోవటంతో వాహనాలు అదుపుతప్పిన సంఘటనలున్నాయి. ఉదయం పూట వాకర్స్ ఇదే రహదారిపైన నడక చేస్తుంటారు.. రాళ్లపేట్, గౌతమినగర్ నుంచి రాకపోకలు సాగించే ప్రాంత ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని దాటాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాఫిక్ అంతరాయం లేకుండా రహదారిపై నిలిపి ఉంచిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

మందు బాబులకు అడ్డాగా రాముని చెరువు



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్ట మందు బాబులకు అడ్డాగా మారుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెరువు కట్టపై మందు బాబులు తాగి, అక్కడే ఖాళీ సీసాలను పడేస్తున్నారు. కొందరు వాటిని పగులగొడుతుండగా, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు పగిలిపోయిన సీసాలతో ఇబ్బందులు పడుతున్నారు. పోలీసుల తనిఖీలు లేకపోవడంతో, మందు బాబులు రాముని చెరువు కట్టను వారి అడ్డాగా మార్చుకుంటున్నారు.

ముళ్ల మొక్కలు.. ప్రజల ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి గోదావరి నది వరకు ఉన్న డివైడర్ మధ్యలో ముళ్లతో కూడిన పూల మొక్కలను నాటారు. ప్రస్తుతం అవి పెరిగి రోడ్డుకు ఇరువైపులా కొమ్మలు ఏపుగా పెరిగాయి. వాటికి ఉన్న ముళ్లు రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదాచారులకు గుచ్చుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో, రద్దీ సమయాల్లో ఈ ముళ్ల మొక్కలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెలలోనే సమ్మక్క, సారలమ్మ జాతర గోదావరి నది ఒడ్డునే పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. దూర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి వస్తుంటారు. ఈ మార్గం నుంచే రాకపోకలు జరగనున్నాయి. ఏపుగా పెరిగిన ముళ్ల మొక్కలు రోడ్డుపైకి రాకుండా తొలగించేలా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



డివైడర్ల మధ్య ముళ్లతో కూడిన పూలమొక్కలు

కూలిన గేటు.. పట్టించుకోని అధికారులు

దండేపల్లి: స్థానిక మండల విద్యావనరుల కేంద్రం కార్యాలయంతో పాటు, ప్రాథమిక పాఠశాల ప్రధాన ద్వారానికి బిగించిన గేటు సుమారు ఏడాది క్రితం కూలిపోయింది. ఇంతవరకు దానికి ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో, గేటు ఎప్పుడు తెరిచే ఉంటుంది. దీంతో రాత్రి వేళ విద్యావనరుల కార్యాలయం, ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో ఇతరులు మల, మూత్ర విసర్జన చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పైగా కొన్ని సందర్భాల్లో కొందరు వ్యక్తులు రాత్రి వేళ పాఠశాల పరిసరాలు, కార్యాలయ పరిసరాల్లో కూర్చుని, సిగరెట్లు మద్యం కూడా తాగుతున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి కూలిన ప్రధాన ద్వారం గేటుకు మరమ్మతు చేపించి, పాఠశాల, కార్యాలయ సమయం ముగిసిన తర్వాత ఇతరులు ఎవరు లోనికి వెళ్లకుండా గేటు వేయాలని పలువురు కోరుతున్నారు.



కూలిన ఎమ్మార్సీ కార్యాలయ గేటు



అమ్మవారికి కుంకుమ పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయంలో వాసవి కనకపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఓడి బియ్యం, చీర సమర్పించారు. వాసవిక్లబ్, వనితా క్లబ్, కప్పుల్ క్లబ్, యూత్ క్లబ్, టీచర్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 102గోత్రాల మహిళలతో 201మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రేణికుంట్ల స్వప్న, రజిని, పద్మ, ఉమారాణి, సాదు స్వన, సరిత, శిరీష, చిలువేరు శైలజ, లావణ్య, మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో పొంచి ఉన్న ప్రమాదం

నెన్నెల: అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనాల్లో పరిమితికి మించి పత్తి, ధాన్యం బస్తాలను రవాణా చేస్తున్నారు. దీంతో పాటు ట్రాలీలలో, ట్రాక్టర్లలో పత్తి ఏరేందుకు కూలీలను తరలిస్తున్నారు. దీంతో రహదారిపై గతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మండలంలోని బొలేరా, హైచర్‌వ్యాన్, ట్రాలీలు ట్రాక్టర్లలో పరిమితికి మించిన బరువులు వేస్తూ రహదారి గుండా పట్టణాలకు తరలిస్తున్నారు. ఏదైన అనుకోని సంఘటన జరిగితే ప్రాణ, ఆస్తినష్టం జరిగే అవకాశం లేకపోలేదు. పరిమితికి మించి సరుకులు, కూలీలను తరలించడంతో వాహనాలు పల్టీలు కొడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాహనదారులు నియమాలు పాటించకపోయినా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఆవుడంలో పత్తి తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు స్పందించి పరిమితికి మించి సరుకులను, కూలీలను రవాణా చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాల నివారణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పరిమితికి మించి తరలిస్తున్న పత్తి